క్లుప్తంగా

ఎలకాటూరులో గంగమ్మ జాతర



అలంకరణలో గంగమ్మ

నింద్ర: మండలంలోని ఎలకాటూరు గ్రామంలో గురువారం గంగమ్మ జాతర పురస్కరించుకొని గ్రామస్తులు అంబళ్లు పోశారు. గ్రామంలో ప్రజలు భారీ సంఖ్యలో గంగమ్మకు అంబళ్లు పోశారు. ఈ సందర్భంగా గంగమ్మను ప్రతిష్టించారు. అనంతరం గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రజలు గంగమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జనుమ, జీలగ పంపిణీ

నింద్ర: మండలంలోని రైతులకు సబ్సిడీపై జనుము, జీలగ పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు మొత్తం జనుము 50 క్వింటాళ్లు, జీలగ 10 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. జనుము 10 కేజీలు రూ.545, జీలగ 10 కేజీలు రూ.615 వంతున పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రంలో తీసుకోవచ్చునని అన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు

నింద్ర: మండలంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల సర్వేలో భాగంలో గురువారం మండల కేంద్రం నింద్ర, మిట్టకండ్రిగ గ్రామల్లో గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. పిల్లలను భవిత పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. మే 15వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు జిల్లాస్థాయి సర్వేలు నిర్వహిస్తామని ఎంఈఓలు వసుమతి దేవి, శ్రీధర్ రాజు తెలిపారు. మండలంలో ప్రతి గ్రామంలో సర్వే చేసి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను చేర్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు వెంకటేష్, వాసు పాల్గొన్నారు.

నేటి నుంచి జీర్ణోద్ధరణ పనులు

పెనుమూరు(కార్వేటినగరం): టీటీడీకి అనుబంధంగా ఉన్న కలికిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి ఈ నెల 28వ తేదీ వరకు జీర్ణోద్ధరణ, అష్టబంధనం, సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఓ ప్రకటన విడుదల చేశారు. 23వ తేదీ శుక్రవారం ఉదయం 9.30 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు మృత్సంగ్రహణం, అంకురార్పణ, వేదరారంభం, హారతి కార్యక్రమాలు ఉంటాయి. 24వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు యాగశాల, వాస్తు, అకల్మషహోమం, రక్షాబంధనం, సాయంత్రం 6 నుంచి 8.30 వరకు అగ్ని ప్రతిష్ట, కళాకర్షణ, ఉక్త హోమాలను నిర్వహిస్తారు. 25వ తేదీ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పంచగవ్యాధివాసం, క్షీరాధివాసం, యాగశాల, వైదిక కార్యక్రమాలు, హారతి, సాయంత్రం 6 నుంచి 8.30 వరకు యాగశాల, వైదిక కార్యక్రమాలు, 26వ తేదీ 9 నుంచి 12 గంటల వరకు యాగశాల, వైదిక కార్యక్రమాలు, రత్నన్యాసం, ధాతున్యాసం, విమానశిఖర స్థాపన, బింబస్థాపన, అష్టబంధనం, ద్రవ్యారాధన సమర్పణ, హారతి, సాయంత్రం 6 నుంచి 8.30 వరకు యాగశాల, వైదిక కార్యక్రమాలు, హారతి ఉంటాయి. 27వ తేదీ యాగశాల వైదిక కార్యక్రమాలు, బింబవాస్తు, చతుర్దశ, నవకలశ స్థాపన, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, హారతి, సాయంత్రం మహా శాంతి హోమాలు, పూర్ణాహుతి, మాహాశాంతి, తిరుమంజనం, శయనాధివాసం, హోత్ర ప్రశంసనం, విశేష హోమాలు ఉంటాయి. 28వ తేదీ వేకువ జామున సుప్రభాత సేవ, యాగశాల, మహా పూర్ణాహుతి యంత్రదానం ఉదయం 7 నుంచి 7.30 గంటల మధ్య కళావాహనం, ఆరాధన, బ్రహ్మోఘోష, యజమాన ఆశీర్వచనం, సాయంత్రం 4 నుంచి కల్యాణోత్సవం, తిరువీధి ఉత్సవం అనంతరం ధ్వజాఅవరోహణ కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఎవరికి వారే..!

- అనుబంధాలు, ఆత్మీయతలు కరువు
- ఎవరికి ఎవరో అన్నట్లు జీవనం
- ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడమే కారణం
- ఇరుగుపొరుగు పలకరించుకోని వైనం
- ప్రస్తుత పరిస్థితులపై నాటి పెద్దల ఆవేదన

మానవ సంబంధాలను మనుషులు దూరం చేసుకుంటున్నారు. కేవలం భార్యాబిడ్డలు బాగుంటే చాలని అనుకుంటున్నారు. ఒక్కప్పుడు పక్కింట్లో పెళ్లంటే ఆ వీధిలో ఉన్నవారంతా తలోచేయి వేసి ఇంట్లో మనుషులు మాదిరిగా పనులు చేసేవారు. ఇప్పుడు అయినవారు కూడా చుట్టపుచూపుగా వస్తున్నారు. అందరూ ఉన్నా పనులన్నీ ఈవెంట్ మేనేజర్లు చూసుకుంటున్నారు. పట్టణీకరణ పేరుతో మనుషులు దూరమవుతున్నారు.

–కార్వేటినగరం



ఆర్కేవీబీ పేటలో రచ్చబండ

పల్లెలు, పట్టణాల్లోని మురికివాడల్లో మాత్రమే ఒకప్పటి అనుబంధా, ఆత్మీయతలు కొనసాగుతున్నాయి. ఉన్నత చదువులు, పెద్ద పెద్ద ఉద్యోగాలు మనుషులను దూరం చేయడానికా లేదా దగ్గర చేయడానికా అని ఆనాటి పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని దశాబ్దాల క్రితం ఎవ్వరికైనా ఏదైనా కష్టం వస్తే బంధువుల కంటే ముందు ఇరుగుపొరుగు వారే ముందుగా వచ్చి ఆదుకునేవారు. ఇప్పుడు అపార్టుమెంట్‌లలో అద్దె ఇళ్లల్లో సైతం మృతదేహాన్ని ఉండనీయని పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడం, చిన్న కుటుంబాలు ఏర్పడటం, చిన్నతనంలో పిల్లలను హాస్టళ్లు, వృద్ధాప్యంలో పెద్దలను ఆశ్రమాల్లో ఉంచడంతో కుటుంబ విలువలు తగ్గిపోతున్నాయి. ఉన్నత చదువుల పేరుతో ఆధునికత సంతరించుకోవడంతో ఎవరికి వారే అన్న రీతిలో సమాజంలో జీవిస్తున్నారు. అపార్ట్‌మెంట్‌లో 20 నుంచి 40 వరకు కుటుంబాలున్నా.. కష్టమొస్తే పలకరించే వారు ఎవ్వరూ రాని పరిస్థితి నెలకొంది. కానీ పండుగలు, చిన్నచిన్న శుభకార్యాలు మాత్రం చేసుకుని ఎంజాయ్ చేసేందుకు ముందుకు వస్తున్నారు.

పుట్టగొడుగుల్లా వృద్ధాశ్రమాలు

20 సంవత్సరాల క్రితం వృద్ధాశ్రమాలు ఎక్కడా ఉండేవి కావు. ఉన్నత చదువులు, ఉద్యోగాలు రావడంతో ఉమ్మడి కుటుంబాలు విడిపోయాయి. 10 సంవత్సరాలుగా వృద్ధాశ్రమాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఇప్పటికే జిల్లాలో ఐసీడీఎస్, మున్సిపాలిటీ, రాస్ స్వచ్ఛంద సంస్థ, మరిన్ని స్వచ్ఛద సంస్థల ద్వారా సుమారు 22 వరకు ఉన్నాయి. వీటిలో సుమారు 637 మంది వరకు వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు. వారిలో 80 శాతం మంది పిల్లలు ఆదరించకుండా పోవడంతో వృద్ధాశ్రమాల్లో జీవనం గడుపుతున్న వారే. సెల్‌ఫోన్ సంస్కృతి రావడంతో ఎవరి మొబైల్‌లో వారు బిజీగా గడుపుతున్నారు. ఎదురుగా ఉన్నవారిని పలకరించే సమయం లేకపోయినా ఎక్కడా కనిపించని వారిని సోషల్ మీడియాలో పలకరించుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

నాటి ఆత్మీయతలు ఇప్పుడు లేవు



నాకు ఇప్పుడు 63 సంవత్సరాల వయసు. నా చిన్నతనంతో పోలిస్తే ఇప్పటి తరంలో అనుబంధాలు, ఆత్మీయతలు బాగా తగ్గిపోయాయి. మనసు విప్పి ఆత్మీయంగా పలకరించుకునే పరిస్థితి లేదు. పండుగలు, శుభకార్యాలని వస్తున్నా ఎవరి బిజీలో వారు ఉంటున్నారు. ఏదైనా కష్టమొస్తే ఆదుకునేవారు కరవయ్యారు. ప్రస్తుతం ఎవరికి వారు ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడుతున్నారు. ఇంట్లో పెద్దలున్నా వారిని వృద్ధాశ్రమాలకు పంపించేస్తున్నారు.

–డాక్టర్ రవిరాజు, రిటైర్డ్ జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, పుత్తూరు

మనిషికి డబ్బే ముఖ్యమైంది.



ఇప్పుడంతా డబ్బే ప్రధానంగా మారింది. మనిషిలో స్వార్థం పెరిగిపోయింది. ఎదుటి మనిషిని ఎలా దోచుకోవాలన్న ఆలోచన ఎక్కువైంది. సమాజంలో ఎవ్వరినీ నమ్మలేని పరిస్థితి నెలకొంది. ఆనాటి అనుబంధాలు, ఆత్మీయతలు మళ్లీ చూస్తామన్నది కలగా మిగిలిపోతోంది. మానవ విలువల కన్నా మనిషికి డబ్బే ముఖ్యమైపోయింది. శుభకార్యానికి పిలిస్తే వస్తారు గానీ కష్టమొస్తే పలకరించే దిక్కు లేకుండా పోయింది. మళ్లీ పాత రోజులు రావాలని కోరుకుంటున్నా.

–డాక్టర్ గోపీనాథ్, సీహెచ్‌సీ వైద్యాధికారి, కార్వేటినగరం

కష్టమొస్తే పలకరించే వారు కరువయ్యారు.



నా పేరు ఆదిశేషారెడ్డి, నాది నెల్లూరు జిల్లా కొవ్వూరు మండలం ఇనమడ గ్రామం నాకు ఇద్దరు కుమార్తెలు. ఒకరు టీచర్, మరొకరు అమెరికాలో ఉన్నారు, వారి చదువులకు ఆ రోజుల్లో రూ.150 దినసరి కూలీగా పని చేసి, చదివించా. స్థల వివాదంలో పిల్లలు పట్టించుకోక పోవడంతో మూడు సంవత్సరాలుగా కార్వేటినగరం రాస్ వృద్ధాశ్రమంలో ఉంటున్నాను. నాగరికత పెరిగింది కానీ తల్లిదండ్రులపై గౌరవం లేని స్థాయికి చేరుకుంటున్నారు. మూడు సంవత్సరాల కాలంలో ఇంతవరకు ఒక్క ఫోన్ కూడా రాలేదు. ఏదైనా అనివార్య కారణాలతో వెళ్లాలంటే మా తమ్ముళ్ల ఇంటికి మాత్రం వెళ్లి అప్పటికప్పుడే తిరిగి వచ్చేస్తాను.

–ఆదిశేషారెడ్డి, ఇనమడ గ్రామం, కొవ్వూరు మండలం, నెల్లూరు జిల్లా

ఘనంగా శోభాయాత్ర



ప్రత్యేకాలంకరణలో శ్రీసీతారామాంజనేయ

గంగాధరనెల్లూరు: శ్రీసీతారామ సమేత అభయాంజనేయ స్వామి శోభాయాత్ర వేల్కూరు ఆలయ ధర్మకర్త దేవరాజులు ఆధ్వర్యంలో గురువారం వైభవంగా సాగింది. హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని వేల్కూరులో వెలసిన శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గంగాధర నెల్లూరులోని అల్లి ఎల్లమ్మ దేవస్థానం నుండి నీవా నది వంతెన మీదుగా వేల్కూరు ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. మేళ తాళాలు, కేరళ వాయిద్యాలు, విచిత్ర వేషధారణ, ఆంజనేయ వేషధారణలతో డప్పు వాయిద్యాలతో బాణసంచాతో జైశ్రీరామ్ నామస్మరణలతో భారీ ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమానికి వడివేలు, చంద్రవేలు, చరణ్ రాజ్, భార్గవ రాజ్, మునస్వామి, చిన్న దొరై కుటుంబ సభ్యులు ఉభయ దారులుగా వ్యవహరించారు. వేల్కూరులోని ఆలయం వద్ద దాదాపు 750 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



హనుమాన్ శోభాయాత్ర







వెదురుకుప్పం: పంచముఖ ఆంజనేయ స్వామి, తమలపాకుల దళాలు, వడమాలతో ఆంజనేయస్వామి, పుత్తూరులో రథంపై ఆంజనేయస్వామి

వైభవంగా హనుమజ్జయంతి





ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి, హోమపూజల్లో పాల్గొన్న భక్తులు

నగరి: మున్సిపల్ కార్యాలయం సమీపంలోని శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో గురువారం హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి కలశపూజ, మూర్తీహోమం, మహాపూర్ణాహుతి, తిరుమంజన పూజలు నిర్వహించారు. సీతారామస్వామి కల్యాణ మహోత్సవం, సుమంగళి కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. సాయంత్రం మాడవీధుల్లో సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామివార్ల ఊరేగింపు నిర్వహించారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పాలాభిషేకం చేసి వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. మాకమాంబాపురం గ్రామ సమీపంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. పచ్చికాపల్లం రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం): చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై పెనుమూరు వద్ద వెలసి ఉన్న వాగ్దేవి సవితా సేవాశ్రమంలో గురువారం వైశాఖ బహుళ దశమిని పురస్కరించుకుని హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆంజనేయస్వామి సహస్రనామార్చనతో తమలపాకు దళాలను స్వామి పాదాలకు సమర్పించారు. అలాగే ఆశ్రమం తరపున వడమాల సేవతో షోడశోపచార పూజలు చేపట్టారు. వాగ్దేవి సవితా సేవాశ్రమంవారు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ అధినేత పూజానంద, ప్రధాన కార్యదర్శి బ్రహ్మదేశం హరగోపాల్, బ్రహ్మచారిణి అనంతమ్మ, హంస రాజశేఖర్‌రెడ్డి, చిట్టెమ్మ, పొన్నుస్వామి, గీత, గిరి, రామకృష్ణనాయుడు, ధనలక్ష్మి, బాలకృష్ణ, లక్ష్మీపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పుత్తూరులో..

పుత్తూరు: పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తిని విశేషంగా అలకరించి రథంపై కొలువుదీర్చారు. రాత్రి బాణాసంచా, మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మధుమేహంపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న వైద్యులు ప్రవీణ్, గురుప్రకాష్

గంగాధరనెల్లూరు: షుగర్ (మధుమేహం)వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన ముఖ్యమని, సరైన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదం బారిన పడే అవకాశం తక్కువ అని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ గురుప్రకాష్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వారు మాట్లాడారు. పీహెచ్‌సీలో షుగర్ వ్యాధిపై ప్రతి మంగళవారం, గురువారం ఉదయం 6 గంటల నుండి ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధునాతన పద్ధతులలో షుగర్ వ్యాధి పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తామని, ప్రత్యేకంగా షుగర్ వ్యాధిగ్రస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కచ్చితమైన రక్త పరీక్ష ఫలితాలతో వ్యాధిగ్రస్తులకు మందుల పంపిణీ జరుగుతోందని, మండల ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అక్రమ క్వారీకి రంగం సిద్ధం

- మహారాజపురం కొండపై అక్రమార్కుల కన్ను
- పాత పర్మిట్... కొత్త అనుమతి?

విజయపురం మండలం పరిసరాల్లో కొండలు ఎక్కువగా ఉన్నాయి. ఈ కొండల్లో నాణ్యమైన గ్రావెల్ దొరుకుతుంది. సమీపంలోని తమిళనాడులో ఈ గ్రావెల్‌కు మంచి డిమాండ్ ఉంది. దీంతో రాష్ట్రస్థాయి నుంచి మండలం వరకు ప్రతి నాయకుడి కన్ను ఈ దందాపైనే పడుతోంది. అధికార బలం ఉంటే చాలు క్వారీలకు నామమాత్రపు అనుమతి తీసుకొచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ అనుమతుల మాటున అక్రమ క్వారీల తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. వీటిని నిలువరించడానికి స్థానిక నాయకులు ఎంతో పోరాటం చేస్తున్నా అక్రమ తవ్వకాలను అడ్డుకోలేకపోతున్నారు.



మహారాజపురంలో క్వారీ తవ్వకాలకు సిద్ధంగా ఉన్న భారీ యంత్రాలు

విజయపురం: మండలం తమిళనాడు సరిహద్దుల్లో ఉంది. అందుకే ఇక్కడ క్వారీ వ్యాపారం కోట్లలో సాగుతోంది. ఒక్కసారి పర్మిట్ తీసుకుంటే కోట్లకు పడగలెత్తవచ్చు. అనుమతి ఇచ్చిన ప్రభుత్వానికి వేలల్లో ఆదాయం వస్తే వ్యాపారికి కోట్లలో ఆదాయం వస్తుంది. దీంతో క్వారీ అనుమతి కోసం ఎన్ని లక్షలు ఇవ్వడానికైనా వ్యాపారులు వెనుకాడడం లేదు.

తమిళనాడులో గ్రావెల్ తవ్వకంపై నిషేధం

తమిళనాడులో గ్రావెల్ తవ్వకాలపై పూర్తిగా నిషేధం ఉంది. పెద్ద పెద్ద నాయకులు సైతం తమిళనాడులో గ్రావెల్ తవ్వడానికి భయపడుతారు. దీంతో కొందరు అక్రమ వ్యాపారుల కన్ను ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన విజయపురం మండలంపై పడింది. గత రెండు వారాలు కొందరు క్వారీ వ్యాపారులు మహారాజపురం కొండను పరిశీలిస్తున్నారని, గ్రావెల్ తరలించడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఇప్పటికే భారీ యంత్రాలను చేర్చి, అధికారులకు తెలియకుండా చదును చేస్తున్నట్లు తెలిసింది. అయితే మహారాజపురం కొండ నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తే, ఎంత పెద్ద నాయకుడైనా తాము అడ్డుకొంటామని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే చెన్నై–బెంగళూరు హైవే పనుల కోసం అంటూ, పచ్చగా ఉన్న కొండను సైతం తవ్వేశారని ఆవేదన చెందుతున్నారు. జిల్లా అధికారులు క్వారీ తవ్వకాలకు అనుమతి ఇవ్వకుండా చూడాలని కోరారు.

కల్పవృక్షంపై వేణుగోపాలుడు

- కమనీయంగా స్వామివారి కల్యాణోత్సవం



కార్వేటినగరం కల్పవృక్ష వాహనంపై ఊరేగుతున్న శ్రీవేణుగోపాలుడు

కార్వేటినగరం: వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగో రోజైన గురువారం ఉదయం శ్రీవేణుగోపాలుడు కల్పవృక్ష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి శద్ధి, తోమాల, పంచాంగ శ్రవణం నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారు కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో విహరిస్తూ, భక్తుల నుంచి కర్పూర హారతులను అందుకున్నారు. అనంతరం అర్చకులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, నారికేళ జలాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. దూపదీప, నైవేద్యాలతో రెండవ గంట నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేశారు.

కమనీయం కల్యాణోత్సవం

గురువారం సాయంత్రం ఉభయ నాంచారుల సమేత శ్రీవేణుగోపాలునికి నిర్వహించిన కల్యాణోత్సవం భక్తులకు కనువిందు చేసింది. 5గంటల నుంచి 6.30 వరకు గంటలపాటు జరిగిన ఆర్జిత కల్యాణోత్సవంలో అధిక సంఖ్యలో దంపతులు పాల్గొని తీర్థప్రసాదలతో పాటు వస్త్రబహుమానం అందుకున్నారు. హాజరైన భక్తులకు టీటీడీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలోని అలంకరణ మండపంలో ఉభయ దేవేరులతో పాటు శ్రీవేణుగోపాలుడిని పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పాలతో సుందరంగా అలంకరించారు. స్వామి వారు సర్వభూపాల వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో విహరించారు. రాత్రి పదిగంటలకు వేదపండితులు ఏకాంత సేవలో స్వామివారిని పవళింపజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ మునిశేఖర్, ఆలయాధికారి సురేష్‌కుమార్, షరాబు బాబుసురేష్, కంకణభట్టర్ తరుణ్‌కుమార్, వేదపండితులు నారాయణదాశరథి, రమేష్, శబరీష్, గోపాలస్వామి, ధన్వంతరి, ప్రశాంత్, అలంకార పండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గరుడోత్సవం

శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం స్వామి వారు గరుడాళ్వార్‌పై రాత్రి తొమ్మిది గంటలకు నగర వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించనున్నట్లు ఆలయాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఉదయం స్వామివారు మోహినీ అవతారంలో పల్లకిపై దర్శనం ఇవ్వనున్నారు.



కల్యాణోత్సవానికి హాజరైన దంపతులు



దేవేరులతో శ్రీవేణుగోపాలునికి కల్యాణోత్సవం

కమనీయంగా సీతారాముల కల్యాణం





కల్యాణోత్సవం, పూజల్లో మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

గంగాధరనెల్లూరు: హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని గోవిందరెడ్డి పల్లి, మిట్టూరు గ్రామాలలో సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. ఈ సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో విశేష పూజలు, అనంతరం కల్యాణం వైభవంగా జరిగింది. రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి హనుమాన్ జయంతి వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవిందరెడ్డిపల్లి గ్రామంలో వైఎస్ఆర్‌సీపీ హయాంలో దాదాపు 38 లక్షల రూపాయలు ఖర్చుతో దేవాలయ అభివృద్ధి పనులు మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆధ్వర్యంలో పూర్తి చేశామని సర్పంచ్ వాసుదేవ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి తెలిపారు. అనంతరం మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని స్వామివారి శేష వస్త్రంతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కె.ఆర్ వెంకట రెడ్డి, మాజీ రాష్ట్ర గ్రీనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు మునిరాజారెడ్డి, చిన్నమ రెడ్డి, అంబోదరపల్లి బాబు రెడ్డి, హేమశేఖర్ రెడ్డి, వేల్కూరు కుట్టి, గోవిందన్, ఢిల్లీ కుమార్, వాసుదేవరెడ్డి, సుధాకర్ రెడ్డి, అయ్యప్పరెడ్డి, వెంకటేష్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, వైఎస్ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



మిట్టూరులో ఆంజనేయస్వామి ఆలయంలో నారాయణస్వామి

రహదారి నియమాలపై ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేయిస్తున్న మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్

నగరి: రహదారి నియమాలు తప్పకుండా పాటిస్తా అంటూ డ్రైవింగ్ లైసెన్సుల కోసం వచ్చినవారితో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. గురువారం రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసు వద్దకు లైసెన్సు కోసం వచ్చిన వారి నైపుణ్యాన్ని పరీక్షించారు. భద్రతారీత్యా అనుదినం రహదారి నియమాలను పాటిస్తూ, అందరికీ సూచనలు చేస్తూ ఇతరులను చైతన్యపరుస్తూ వ్యవహరిస్తానని, ప్రభుత్వం నిర్ణయించిన రహదారి నియమాలను అతిక్రమించబోమని ప్రమాణం చేయించారు.